అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

వాడవాడలా సంక్రాంతి సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెలుగుదనం ఉట్టిపడేలా పిల్లలు, పెద్దలు సంప్రదాయ వస్త్రధారణలో మెరిశారు. బంధువులు, స్నేహితులతో ఇళ్లు కళకళలాడాయి. వాకిళ్లలో వేసిన రంగురంగుల రంగవల్లులు, ఆకాశంలో ఎగురవేసిన పతంగులు, హరిదాసు కీర్తనలు, డూడూబసవన్న విన్యాసాలతో పల్లెలు, పట్టణాలు, నగరాల్లో పండగ శోభ నెలకొంది. సంబరాల్లో భాగంగా పలుచోట్ల చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

– బొబ్బిలి, రాజాం సాక్షి నెట్‌వర్క్


రాజాం సిటీ: ఆకట్టుకున్న యువతుల కోలాటం


రాజాం సిటీ: ఎంజేవలసలో ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు


వంగర: ఆకట్టుకున్న సేవ్ గర్ల్ పేరిట వేసిన ముగ్గు


వంగర: టగ్ ఆఫ్ వార్‌లో పాల్గొన్న ప్రజలు


రేగిడి: వన్నలిలో పూజల్లో పాల్గొన్న మహిళలు


సంక్రాంతి వేళ సంప్రదాయ వస్త్రధారణలో ఎమ్మెల్యే కంబాల జోగులు


బొబ్బిలి రూరల్: నారాయణప్పవలసలో పతంగులు ఎగురవేస్తున్న చిన్నారులు


తెర్లాం: అరసబలగలో రంగవల్లులు వేస్తున్న చిన్నారులు


రామభద్రపురం: మండల కేంద్రంలో ఓ ఇంటి ముందు గొబ్బెమ్మలు ఆడుతున్న మహిళలు



మెంటాడ: చల్లపేటలో రంగవల్లులు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం


రామభద్రపురం: చొక్కాపువీధిలో పితృదేవతలకు పూజలు చేస్తున్న ఓ కుటుంబం


బొబ్బిలి రూరల్: చింతాడలో ఉత్సాహంగా డాన్స్ చేస్తున్న చిన్నారులు


బొబ్బిలి: పాతబొబ్బిలి నాయుడువీధిలో రంగవల్లుల పోటీలు


బొబ్బిలి: స్వామివారి వీధిలోని వేంకటేశ్వరాలయంలో గోపూజ


బొబ్బిలి రూరల్: ఎం.బూర్జవలసలో గోపూజ చేస్తున్న స్థానికులు

క్లుప్తంగా

ఏపీటీజీ జిల్లా అధ్యక్షుడిగా కృష్ణదాస్


ఏ.కె.కృష్ణదాస్

బొబ్బిలి రూరల్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్(ఏపీటీజీ) జిల్లా అధ్యక్షుడిగా అలజంగి సీబీఎం పాఠశాల హెచ్‌ఎం కె.కృష్ణదాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీటీజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.కె.చిన్నప్ప నాయామక ఉత్తర్వులు విడుదల చేశారు. జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కృష్ణదాస్ మాట్లాడుతూ ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు, హక్కులతో పాటు ఉపాధ్యాయ సమస్యలపై పోరాడతామన్నారు. ఏపీటీజీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కృష్ణదాస్‌ను సోమవారం పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

బాలఅన్నమ్మకు బోనాలు సమర్పణ


బాలఅన్నమ్మ పేరంటాలకు బోనాలు చెల్లిస్తున్న భక్తులు

సంతకవిటి: మండలంలోని సురవరం గ్రామంలో బాలఅన్నమ్మ పేరంటాలకు భోగి బోనాలు ఆదివారం సమర్పించారు. ఏటా సంక్రాంతి పర్వదినాన ఇలా అమ్మవారికి బోనాలు చెల్లిస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా


పాలవలస రామచంద్రినాయుడు

రేగిడి: వైఎస్సార్ సీపీ అభివృద్ధికి తాను కృషి చేస్తానని మండల గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల అబ్జర్వర్ పాలవలస రామచంద్రినాయుడు అన్నారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి, ఈ పదవిని కట్టబెట్టిన పార్టీ కేంద్ర పాలక మండలి సభ్యుడు పాలవలస రాజశేఖరం, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. రేగిడి మండల నాయకుల సూచనలు, సలహాలతో అన్ని గ్రామాల గృహ సారథులు, గ్రామ సచివాలయాల కన్వీనర్లతో కలిసి పార్టీని బలోపేతం చేస్తామన్నారు.

మహానేతను స్మరిస్తూ పూజలు


వైఎస్సార్ చిత్రపటం వద్ద కొత్త బట్టలు ఉంచి, పూజలు చేస్తున్న వాసునాయుడు

వంగర: మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డిని స్మరిస్తూ మండలంలోని రుషింగికి చెందిన విజయనగరం జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ యలకల వాసునాయుడు ప్రత్యేక పూజలు చేశారు. ఏటా సంక్రాంతి సందర్భంగా పూర్వీకులను స్మరిస్తూ ఎటువంటి పూజలు చేస్తారో అదే తరహాలో మహానేతకు పూజలు చేయడం విశేషం.

అ'పూర్వ' కలయిక


పూర్వ విద్యార్థులు

రాజాం సిటీ: మండల పరిధిలోని బొద్దాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2001–2002 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు సోమవారం కలిశారు. సరిగ్గా 22 ఏళ్ల తర్వాత ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, ఆనాటి స్మృతులు గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం అప్పట్లో వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని తీర్మానం చేశారు.

దేవుని ప్రార్థనతో ప్రతి ఒక్కరూ పరిశుద్ధులు


జీవన్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఏసు ప్రేమాలయం సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: దేవుని ప్రార్థనతో ప్రతి ఒక్కరూ పరిశుద్ధులు కావాలని ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రెవరెండ్ జీవన్‌కుమార్ అన్నారు. పట్టణంలోని అంబటిసత్రం జంక్షన్‌లో ఉన్న ఏసు ప్రేమాలయంలో సోమవారం నిర్వహించిన ఆరాధనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఏసు ప్రేమాలయం ప్రతినిధులు రెవరెండ్ జీవన్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాస్టర్ అలజంగి రవికుమార్, సిస్టర్ సువర్ణ, కోరాడ నాగేశ్వరరావు, విక్టర్ బాబు, జాన్ కొర్నేలి, పెంకి దేవరాజు, కలివరపు కిశోర్, ఝాన్సీ, సుజాన్, నిశాంత్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

తొలగిన తాగునీటి ఇక్కట్లు


నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన కుళాయి కనెక్షన్లను ప్రారంభిస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి (ఫైల్)

- అమృత్ పథకం నిధులతో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు
- 600 ఇంటర్ కనెక్షన్లతో అన్ని ప్రాంతాల ప్రజలకు వ్యక్తిగత కుళాయిలు
- పెరిగిన నీటి నిల్వ, పంపింగ్ సామర్థ్యం

విజయనగరం: నగర ప్రజల తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా అన్ని వార్డుల్లో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేసింది. గత ప్రభుత్వంలో ఐదురోజుల కోసారి కుళాయిల ద్వారా నీరు సరఫరా చేయగా.. ప్రస్తుతం రోజు విడిచి రోజు పూర్తిస్థాయిలో నీటిని సరఫరా చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల చొరవతో..

గతంలో విజయనగరంలో తాగునీటి ఎద్దడి విపరీతంగా ఉండేది. ఎప్పుడు కుళాయిలు వస్తాయో.. ఎప్పుడు మోరాయిస్తాయో తెలియని పరిస్థితి. మహిళలు పనులు మానుకుని కుళాయి పాటింట్ల వద్ద రోజంతా నిరీక్షించేవారు. వేసవిలో అయితే నీటి కష్టాలు మరింత అధికమయ్యేవి. ప్రజల తాగునీటి ఇబ్బందులు దగ్గర నుంచి చూసిన కోలగట్ల వీరభద్రస్వామి.. 2019లో ఎన్నికల ప్రచారంలో తాను ఎమ్మెల్యేగా గెలుపొందితే తాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యేగా గెలుపొందిన మరుక్షణం నుంచే తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమై ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశారు. అమృత్ పథకం నిధులతో నగరంలో దాసన్నపేట, చెంచుల కాలనీ తదితర ప్రాంతాల్లో వాటర్ ట్యాంకులను నిర్మించారు. అంతేకాకుండా నగర వ్యాప్తంగా 600 వరకు ఇంటర్ కనెక్షన్లను ఏర్పాటు చేశారు. పంపింగ్ సామర్థ్యాన్ని పెంచారు. రూ.200 లకే ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. కుళాయి కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుంటే, సంబంధిత అధికారులు దాన్ని పరిశీలించి వెంటనే కుళాయి ఏర్పాటు చేసేలా ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం ప్రతీ ఇంటికి కుళాయి కనెక్షన్ ఏర్పాటు కావడంతో తాగునీటి కష్టాలు తొలగిపోయాయి.

లీకుల నివారణపై దృష్టి

వేసవిలో కూడా రోజు విడిచి రోజు నీటి పంపిణీ జరిగే విధంగా ఇంజినీరింగ్ అధికారులతో సమాలోచనలు జరిపారు. ముసిడిపల్లి నుండి అధిక ప్రాంతాలకు తాగునీటి పంపిణీ జరుగుతోంది. ఇటీవల ముసిడిపల్లి ప్రాంతంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఇంజినీరింగ్, ఆర్అండ్‌బీ, కార్పొరేటర్ల సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. నగరంలోని అన్ని పైపులైన్లను నిశితంగా పరిశీలించి లీకుల నివారణకు చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని కోలగట్ల ఆదేశించారు. 40 ఏళ్లుగా తాగునీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్న బుచ్చన్న కోనేరు ప్రాంతంలో ఇటీవల కోలగట్ల చొరవతో అధికారులు ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయడంతో స్థానిక మహిళలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా గోవర్ధనగిరి జాతర


గోవర్ధనగిరి జాతరలో భక్తులు

సంతకవిటి: మండలంలోని గోవిందపురం గ్రామంలో గోవర్ధన గిరి జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో యాత్రలో పాల్గొన్న భక్తులు కొండపై కొలువైన వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ జాతరను తరతరాలుగా ధర్మకర్తలు ఊడు తవిటమ్మ, లక్ష్మణరావు, కృష్ణారావు, సత్యనారాయణ నిర్వహిస్తుండడం గమనార్హం. జాతర నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేసినట్లు సర్పంచ్ రాగోలు పద్మజరమేష్‌నాయుడు తెలిపారు.

300 మందికి వస్త్రదానం


రామభద్రపురం: పేదలకు దుస్తులు దానం చేస్తున్న తూముల దాలియ్య, దంపతులు

రామభద్రపురం: సంక్రాంతి పండగ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు తూముల దాలయ్య కుటుంబ సభ్యులు ఆదివారం సుమారు 300 మంది పేదలకు వస్త్రదానం చేశారు. మగవారికి దుప్పటి, పంచ, పండ్లు, ఆడవారికి చీర, దుప్పటి, పండ్లు చొప్పున దానం చేశారు. ఈ సందర్భంగా దాలియ్య మాట్లాడుతూ తమ తండ్రి స్మారకార్థం ఏటా సంక్రాంతి రోజున పేదలకు వస్త్రాలు దానం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తూముల గోపాలకృష్ణ, తూముల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


తెర్లాం: పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న సువ్వాడ నరసింహనాయుడు

☛ తెర్లాం: మండలంలోని రంగప్పవలస, ఎం.ఆర్.అగ్రహారం, కాలంరాజుపేట గ్రామాల్లోని నిరుపేదలకు వీఆర్వోల సంఘం అధ్యక్షుడు, ఎం.ఆర్.అగ్రహారం సచివాలయ వీఆర్వో సువ్వాడ నరసింహనాయుడు దుస్తులు పంపిణీ చేశారు. తన తమ్ముడు సువ్వాడ దుర్గాప్రసాద్ జ్ఞాపకార్థం సంక్రాంతి పండగ సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు.

☛ రాజాం సిటీ: మండల పరిధిలోని సారధి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు కిల్లారి శ్రీనివాసరావు సమకూర్చిన దుస్తులను సీఐ రవికుమార్ చేతులమీదుగా సోమవారం పేదలకు పంపిణీ చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలన్నారు. పేదల కుటుంబాల్లో ఆనందం చూసేందుకు తనకు ఉన్న దాంట్లో కొంతమొత్తం వెచ్చించి, సేవ చేసేందుకు ముందుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పి.లక్ష్మణరావు, డి.గోపాలం, ఫోరం ఫర్ బెటర్ రాజాం సభ్యులు ఎం.మదన్‌మోహన్, వి.వంశీకృష్ణ, కె.మోహనరావు పాల్గొన్నారు.


రాజాం సిటీ: పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న సీఐ రవికుమార్


రేగిడి: వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న చిరంజీవినాయుడు

దుస్తుల వితరణ

రేగిడి: మండలంలోని లింగాలవలసకు చెందిన అడపా చిరంజీవినాయుడు తన తల్లి సీతమ్మ జ్ఞాపకార్థం గ్రామంలో 200 మంది పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు సోమవారం దుస్తుల వితరణ చేశారు. తొమ్మిది సంవత్సరాలుగా ఏటా సంక్రాంతి, కనుమ రోజుల్లో ఇలా ప్రజాసేవ చేయడం చాలా సంతోషంగా ఉందని దాత అన్నారు.

☛ రాజాం: పట్టణ పరిధిలోని బుచ్చింపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ యూత్ లీడర్ పిట్టా జగదీష్ 150 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. పురుషులకు లుంగీలు, తువ్వాలులతో పాటు మహిళలకు చీరలు, దుప్పట్లు అందజేశారు.

గోమాతకు పూజలు


రేగిడి: గోమాతను పూజిస్తున్న మహిళా రైతు

రేగిడి: కనుమ పండగ సందర్భంగా మండలంలోని అంబకండి, రేగిడి, వన్నలి, ఉనుకూరు, సంకిలి గ్రామాల్లో సోమవారం గోమాతకు పూజలు చేశారు. గోవును పూజిస్తే ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలగడంతో పాటు పంటలు బాగా పండుతాయనే నమ్మకంతోనే ప్రజలు పూజిస్తారు.

వంగర: మండలంలోని సంగాం గ్రామ సంగమేశ్వరాలయం వద్ద సోమవారం గోమాత పూజలు నిర్వహించారు. పాడిఆవులకు స్నానం చేయించి, పసుపు, కుంకుమలతో పూజించారు.


వంగర: సంగాంలోని సంగమేశ్వరాలయంలో గోమాత పూజలు

పూర్వ విద్యార్థుల కలయిక


రామతీర్థం ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థం ఉన్నత పాఠశాల ఆవరణంలో 1998–99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వచ్చిన సందర్భంగా వారంతా పాఠశాల ఆవరణంలో ఒకరినొకరు నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్సై రాంబాబు, ఉపాధ్యాయులు రమేష్, బీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.